సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



చంద్రయాన్-3లో మనోళ్లు

చంద్రయాన్-3 విజయంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు చెందిన పలువురు భాగస్వాములయ్యారు. IIలో



ఎస్ఐ అభ్యర్థులకు పరీక్షలు

స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్ఐల నియామకాల్లో భాగంగా అభ్యర్థులకు శుక్రవారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. IIలో

అన్ని కోణాల్లో దర్యాప్తు



ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి కేసును అన్ని కోణాల్లోను దర్యాప్తు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. IIలో

న్యూస్‌రీల్

రాజభాషా అమలులో వాల్తేర్ డివిజన్ భేష్

పార్లమెంట్ సబ్ కమిటీ ప్రశంస



కమిటీ కన్వీనర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: రాజభాష అమలులో వాల్తేర్ డివిజన్ ఉత్తమ ఫలితాలు సాధిస్తోందని పార్లమెంటరీ అధికారిక భాషా కమిటీకి చెందిన 2వ సబ్ కమిటీ ప్రశంసించింది. డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో బుధవారం కమిటీ ప్రతినిధులు పర్యటించి.. అధికార భాషా అమలు తీరును పరిశీలించారు. అధికారిక కార్యకలాపాలు, ఇతర విభాగాల్లో రాజభాషా ప్రయోగాన్ని వీరు ప్రత్యక్షంగా పరీక్షించారు. ఇప్పటివరకు అధికారిక భాషపై శిక్షణ పొందని సిబ్బందిని గుర్తించి.. శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. తరచుగా సిబ్బందికి హిందీపై వర్క్‌షాప్‌లు నిర్వహించాలని, స్థానిక భాషలతోపాటు హిందీలో కూడా ప్రకటనలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అధికారిక భాష అమలులో వాల్తేర్ డివిజన్ అనుసరిస్తున్న పద్ధతులను అభినందించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు కమిటీ కన్వీనర్ రంజన్ బెన్ భట్ ప్రశంసాపత్రం అందించారు. ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే రాజభాషా అధికారి ఎల్లీన పండా, వాల్తేర్ డివిజన్ రాజభాష ఇన్‌చార్జి ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియ వేగవంతం

సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష (రీసర్వే)లో భాగంగా మ్యుటేషన్ల పనులు వేగవంతం చేయాలని సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష (రీ సర్వే) ప్రగతిపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో విజయవాడ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన ప్రగతిని వివరించారు. నిర్ణీత గడువులోగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో రీ సర్వే పూర్తి చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'అర్పిత' ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పురస్కారాలు

సాక్షి, అమరావతి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించనున్నట్లు విశాఖపట్నంకు చెందిన అర్పిత సాంస్కృతిక సేవా సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ గణగళ్ల విజయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగంలో ఉండి బోధన, బోధనేతర రంగాల్లో విశేష కృషి చేస్తున్నవారిని గత 22 ఏళ్లుగా సత్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన ఉపాధ్యాయులకు సెప్టెంబర్ 11న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయలంలో నిర్వహించే వేడుకల్లో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు విజయకుమార్ చెప్పారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తమ దరఖాస్తులను ఈనెల 31 లోగా 9391379903 వాట్సాప్ నంబర్‌కు పంపాలని కోరారు.

వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి కౌన్సెలింగ్

మహారాణిపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 మంది సిబ్బంది ఉండాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్, పోస్టింగ్ ప్రక్రియకు గురువారం శ్రీకారం చుట్టారు. రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి పర్యవేక్షణలో మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

'గాంధీ' పరిశోధన పత్రాలకు ఆహ్వానం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాంధీయన్ విజన్ జర్నల్‌లో ప్రచురించడానికి పరిశోధకుల నుంచి పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్‌లో ప్రచురించే ఈ సంచికలో గాంధీజీ ఆలోచనలు విస్తృతంగా చర్చిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ పరిశోధన పత్రాలను aungsc@gmail.comకి పంపాలని కేంద్ర సంచాలకులు ఆచార్య కె.సీ తామాణిక్యం సూచించారు.

విశాఖ.. సరికొత్తగా..



కుమారి కల్యాణి మండపం-ఎస్ఎస్‌ఎల్ మధ్య 80 ఫీట్ రోడ్డు

- రహదారులు మరింత విశాలం
- జంక్షన్ల అభివృద్ధితో కొత్త రూపు
- రూ. 100 కోట్లతో రోడ్ల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణం
- రూ. 6 కోట్లతో పోలమాంబ జంక్షన్ నుంచి బీచ్ వరకూ స్మార్ట్ రోడ్
- రూ. 11.36 కోట్లతో జంక్షన్ల అభివృద్ధి



అడివివరం నుంచి హనుమంతవాక మధ్య గల బీఆర్‌టీఎస్ రోడ్డు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

విశాఖ సరికొత్తగా ఆవిష్కృతమవుతోంది. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా రహదారుల అభివృద్ధితో పాటు ట్రాఫిక్‌కు అనుగుణంగా పర్యాటకులకు ఆహ్లాదకరంగా జంక్షన్లు కనువిందు చేయనున్నాయి. ఇక యూరోపియన్ స్టైల్‌లో నోరూరించే వంటలకు ఈట్ స్ట్రీట్స్ ఆహ్వానం పలకనుండగా.. వీధులంటే ఇలా ఉండాలనే రీతిలో స్మార్ట్ రోడ్లు దర్శనమివ్వనున్నాయి. ఇప్పటికే ఆధునిక బస్ బేలతో సుందరంగా దర్శనమిస్తున్న విశాఖ నగరం.. ఇటు విశాలమైన రోడ్లు, అటు జంక్షన్ల అభివృద్ధితో పాటు స్మార్ట్ రోడ్లతో నగరవాసులకు మరింత సౌకర్యాలను మెరుగుపరిచే విధంగా గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ప్రణాళికలను రచిస్తోంది.

విశాఖ మహా నగరంలో వివిధ కూడళ్ల వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. అయితే, ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని వీటిని అభివృద్ధి చేయాలని జీవీఎంసీ నిర్ణయించింది. అంతేకాకుండా ఆయా కూడళ్లను విశాలంగా చేయడంతో పాటు మధ్యలో పర్యాటకులను ఆకట్టుకుని.. ఆహ్లాదాన్ని అందించే విధంగా జంక్షన్ల రూపురేఖలు మారనున్నాయి. ప్రతీ జంక్షన్ వద్ద ఏదో ఒక థీమ్‌తో అభివృద్ధి పరచాలనేది జీవీఎంసీ అధికారుల ఆలోచన.

- రూ.2.32 కోట్లతో లా కాలేజీ, ఎండాడ, డెయిరీఫారమ్, హనుమంత జంక్షన్లను అభివృద్ధి చేయనున్నారు.
- రూ.40 లక్షలతో గురుద్వారా జంక్షన్, రూ.35 లక్షలతో ఉషోదయ జంక్షన్, రూ.45 లక్షలతో కురుపాం జంక్షన్ల అభివృద్ధి.
- రూ. కోటి నిధులతో లంకెలపాలెం, గాజువాక వద్ద ట్రాఫిక్ జంక్షన్ల అభివృద్ధి పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయి.
- రూ. 45 లక్షలతో గాజువాకలోని శ్రీనగర్ జంక్షన్, మరో రూ.45 లక్షలతో గాజువాక పోలీస్ స్టేషన్ జంక్షన్ల అభివృద్ధి కోసం ఇంకా జాతీయ రహదారి సంస్థ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అనుమతులు వచ్చిన వెంటనే ఈ పనులను కూడా ప్రారంభించాలని జీవీఎంసీ నిర్ణయించింది.
- రూ. 35 లక్షలతో చేపట్టిన సింహాచలం జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి.
- ఇక రూ.40 లక్షలతో ఆటోనగర్ జంక్షన్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారు. ఇవేకాకుండా రూ. 1.30 కోట్లతో ఆర్అండ్‌బీ జంక్షన్, కాకానీనగర్ జంక్షన్లను కూడా అభివృద్ధి చేయాలని జీవీఎంసీ నిర్ణయించింది. మొత్తంగా రూ.7.50 కోట్లతో జంక్షన్ల అభివృద్ధి పనులను రానున్న రెండు నెలల కాలంలో పూర్తి చేయాలని జీవీఎంసీ లక్ష్యంగా నిర్ణయించుకుంది. అంతేకాకుండా రూ. 85 లక్షలతో తాటిచెట్లపాలెం జంక్షన్, రూ.1.29 కోట్లతో ఏఎస్ రాజా జంక్షన్, రూ.96 లక్షలతో అక్కయ్యపాలెం జంక్షన్, రూ.76 లక్షలతో కైలాసగిరి జంక్షన్లు కూడా కొత్త రూపు సంతరించుకోనున్నాయి.

స్మార్ట్ రోడ్డు

విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు వీలుగా స్మార్ట్ రోడ్లను జీవీఎంసీ అభివృద్ధి చేస్తోంది. స్మార్ట్ సిటీ నిధులతో ఈ రోడ్లను ఆకర్షణీయంగా అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే పోర్టు గెస్ట్ హౌస్ నుంచి బీచ్ రోడ్ వరకూ స్మార్ట్ రోడ్‌గా జీవీఎంసీ అభివృద్ధి చేసింది. అదేతరహాలో పోలమాంబ గుడి జంక్షన్ నుంచి బీచ్ రోడ్‌లోని పార్క్ హోటల్ వరకూ స్మార్ట్ సిటీ నిధులతో స్మార్ట్ రోడ్‌గా అభివృద్ధి చేయనున్నారు. **ఇందుకోసం** ఇప్పటికే స్మార్ట్ సిటీ **కార్పొరేషన్ కింద** టెండర్లను ఆహ్వానించారు. **రూ. 6 కోట్లతో చేపట్ట**బోయే ఈ పనులను **పూర్తి చేసి...** రానున్న రోజుల్లో ఈ స్మార్ట్ రోడ్ **ఒక మోడల్‌గా చే**యాలనేది అధికారుల ఆలో**చన. మరోవైపు స్మా**ర్ట్ సిటీ కార్పొరేషన్ కింద **పార్క్ హోటల్ ఎదు**రుగా ఉన్న డిఫెన్స్ కాల**నీతో పాటు సాగర్**నగర్ వద్ద యూరోపియన్ **స్టైల్‌లో నోరూరించే** వంటకాలను సిద్ధం చేసే రెండు ఈట్ స్ట్రీట్స్‌ను కూడా రూ.6.24 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు.

రోడ్లు మరింత విశాలంగా..

పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా కొత్త రోడ్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. అంతేకాకుండా ఇప్పటికే ఉన్న రోడ్లను మరింత వెడల్పు చేయడంతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఇందుకు అనుగుణంగా సుమారు రూ.100 కోట్లకుపైగా వ్యయంతో కొత్తగా 30 రోడ్లను అభివృద్ధి చేయాలని జీవీఎంసీ నిర్ణయించింది. ఇందులో మాస్టర్ ప్లాన్ రోడ్లతో పాటు పెరుగుతున్న సిటీ అవసరాలకు అనుగుణంగా వీటిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది.

అభివృద్ధి చేయనున్న ప్రధాన రోడ్ల వివరాలివే..

ప్రాంతం	పొడవు (కి.మీ.)	ప్రతిపాదిత రోడ్డు (అ)
కె.నగరపాలెం జంక్షన్-కాపులుప్పాడ	2.5	40
బోయపాలెం(ఎన్‌హెచ్-16)-విలాసం ప్రాజెక్ట్	3.1	100
ఎన్‌హెచ్16-రేవెళ్లపాలెం	34	100
బక్కన్నపాలెం రెవెళ్లపాలెం-నవోదయ స్కూల్	1.46	100
ఎన్‌హెచ్16-నగరపాలెం, సాక్షి ప్రెస్	1.55	80
ఎన్‌హెచ్16-బక్కన్నపాలెం (సాయిప్రియ లేఅవుట్ మీదుగా)	1.7	100
ఎన్‌హెచ్16-గీతం కాలేజ్ మీదుగా బీచ్ రోడ్డు	3.39	100
కొమ్మాది ఎన్‌హెచ్16-చైతన్య ఇంజినీరింగ్ కాలేజ్	1.5	100
బక్కన్నపాలెం-నవోదయ స్కూల్	1.07	100
హనుమంతవాక-కైలాసగిరి సర్కిల్	1.1	60
పోలమాంబ గుడి- వీఎంఆర్డీఏ పార్క్ రోడ్డు (మానసిక ఆస్పత్రి మీదుగా)	1.1	60
సత్యం జంక్షన్-ఏఎస్ఆర్ విగ్రహం	1.1	100
ఏఎస్ఆర్ విగ్రహం-వెంకోజీపాలెం	1.7	80
నర్సింహనగర్(పోర్టు స్టేడియం వెనుక)-ఏఎస్ఆర్ విగ్రహం	1.65	80
ఆర్టీసీ బస్టాండ్-వేమన మందిరం	1.9	150
జగదాంబ-పాతపోస్టాఫీస్	2.40	60
రెల్లి వీధి	0.207	30
రీడింగ్ రూం-బీచ్ రోడ్డు	0.52	60
రామసత్యనారాయణస్వామి దేవస్థానం రోడ్డు	0.9	30
దసపల్లా హిల్స్(నేవీ హౌస్)-నౌరోజీ రోడ్డు	-	100
దొండపర్తి-అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డు	1.49	60
పాలిటెక్నిక్ కాలేజ్-వైభవ్	0.86	60
ఎన్‌హెచ్5-దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డు	2.1	100
అనకాపల్లి పెరుగు బజార్-గాంధీ బొమ్మ జంక్షన్	0.4	50
తొలి పావంచ-అడవివరం	1.25	100
గోశాల-తొలి పావంచ జంక్షన్	0.9	100
వంటిల్లు-కుమారి కల్యాణమండపం	2.5	80
పెందుర్తి బీఆర్‌టీఎస్ రోడ్డు	1	100
పెందుర్తి జంక్షన్-బీఆర్‌టీఎస్ బస్టాప్	0.4	100

రహదారుల మెరుగు



నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలో రోడ్ల నిర్మాణం జరుగుతోంది. ఉన్న రోడ్లను మరింత విశాలంగా చేసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా ట్రాఫిక్ అవసరాలను తీర్చేందుకు ప్రధానమైన జంక్షన్లన్నీ అభివృద్ధి చేస్తున్నాం.

– హరి వెంకటకుమారి, మేయర్

వచ్చే మూడు నెలల్లో..



ఇక్కడి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 30 ప్రధాన రహదారులను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. రూ.100 కోట్లతో ఈ రోడ్ల అభివృద్ధి జరగనుంది. వచ్చే రెండు, మూడు నెలల్లోనే వీటిని పూర్తి చేయాలని భావిస్తున్నాం. ప్రధానమైన జంక్షలన్నీ కూడా కొత్త రూపు సంతరించుకోనున్నాయి. నగర ప్రజలకు ఎప్పటికప్పుడు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచడంతో పాటు నగరాన్ని మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాం.

– సాయికాంత్ వర్మ, జీవీఎంసీ కమిషనర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, గణేష్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

- 7,014 మందికి నవరత్నాలు- ద్వైవార్షిక నగదు మంజూరు
- జిల్లాలో రూ.8.84 కోట్ల లబ్ధి: కలెక్టర్

లబ్ధి ఇలా..

పథకం	లబ్ధిదారులు	లబ్ధి పొందిన మొత్తం
అమ్మ ఒడి	593	రూ.88.95 లక్షలు
జగనన్న చేదోడు	2,668	రూ.2.66 కోట్లు
ఈబీసీ నేస్తం	241	రూ.36 లక్షలు
మత్స్యకార భరోసా	11	రూ.1.10 లక్షలు
జగనన్న వసతి దీవెన	1,293	రూ.1.12 కోట్లు
జగనన్న విద్యా దీవెన	2,194	రూ.3.78 కోట్లు
వ్యవసాయం	14	రూ.70 వేలు

మహారాణిపేట: అర్హులై ఉండి వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు పొందని వారికి నవరత్నాలు- ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమాన్ని గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు.

కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో అర్హత కలిగి లబ్ధి పొందని 7,014 మంది లబ్ధిదారులకు రూ.8.84 కోట్లు జమ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్ లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వార్డు, గ్రామ సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి పూర్ణిమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



నాలుగో విడత అమ్మ ఒడి డబ్బులు నాకు తెలిసిన వారందరికీ వచ్చాయి. నాకు ఎందుకు రాలేదో తెలియలేదు. ఆ సమయంలో మా ఇంటికి వచ్చిన వలంటీర్‌కు అమ్మ ఒడి రాలేదని చెప్పాను. సచివాలయంలో తనిఖీ చేశారు. నా బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాలేదు. వెంటనే ఆధార్ అనుసంధానం చేశాను. ఇప్పుడు అమ్మ ఒడి డబ్బులు వచ్చాయి. నా భర్తకు మత్స్యకార భరోసా కింద రూ.10 వేలు వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

-మద్దు కోమల, జాలారిపేట

అప్పన్న సన్నిధిలో మాజీ క్రికెటర్లు



అప్పన్నను దర్శించుకున్న భారత మాజీ క్రికెటర్లు హేమంగ్ బదానీ, అమోల్ ముజుందార్

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామిని గురువారం భారత మాజీ క్రికెటర్లు హేమంగ్ బదానీ, అమోల్ ముజుందార్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని అధికారులు వారికి అందించారు. రాష్ట్ర మాజీ క్రికెటర్ రాఘవ, వ్యాఖ్యాత రమన్ వారి వెంట ఉన్నారు.

లక్ష్మి.. రావే మా ఇంటికి..

వరలక్ష్మీ వ్రతానికి అంతా సిద్ధం











నగరం శ్రావణ శోభతో కళకళలాడింది. శ్రావణ మాసంలో రెండవ శుక్రవారం కావడం, అదీ వరలక్ష్మీ వ్రతం చేసుకునే ఈ వారానికి ప్రత్యేకత ఉండటంతో గురువారం నగరంలోని బంగారు దుకాణాలు, మార్కెట్లు మహిళలతో నిండిపోయాయి. పూర్ణామార్కెట్, జగదాంబ, అక్కయపాలెం, కంచరపాలెం, గాజువాక ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ కనిపించింది. వరలక్ష్మీవ్రతం సందర్భంగా పూజా సామగ్రి, బంగారు కాసులు కొనుగోలు చేసుకునేందుకు తరలివచ్చిన వారితో పూర్ణామార్కెట్‌లో రాత్రి వరకు రద్దీ కనిపించింది. కాగా.. పువ్వులు, పండ్లు, కొబ్బరి కాయలు, పూజా సామగ్రి ధరలను పెంచేసి వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రూ.4.73 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశంలో రూ.4.73 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థాయీ సంఘం అజెండాలో 30 అంశాలతో పాటు 3 టేబుల్ అజెండాలు పొందుపరిచారని, అన్ని అంశాలపై సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రూ.3,33,51,000 పనులకు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి రూ1.40 కోట్ల పనులకు ఆమోదం తెలిపారని, రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపులు, ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన అంశాలతో పాటు ఇతర అంశాలను సభ్యులు ఆమోదించారని వెల్లడించారు. లాసన్స్ బే పార్క్‌లో రూ.36.53 లక్షలతో బ్యాడ్మింటన్ కోర్టు, యోగా ఫ్లోరింగ్, ఓపెన్ స్టేజ్, షెల్టర్ కోసం పగోడా, జిమ్ బాటమ్ పేపర్ ఫ్లోరింగ్, నీటి సరఫరా, 52వ వార్డు గౌరీనగర్‌లో శానిటరీ, సచివాలయ భవనానికి మిగిలిన పనుల పూర్తి, మర్రిపాలెంలోని పోస్టాఫీస్ వద్ద వరదనీటి కాలువ నిర్మాణం, కరాసలోని వరద నీటి కాలువ, గణేష్‌నగర్ నుంచి గౌరీనగర్ వరకు వరద నీటి కాలువ నిర్మాణానికి సభ్యులు ఆమోదించారన్నారు. జీవీఎంసీలో ఆరేళ్లుగా జూనియర్ అసిస్టెంట్‌గా సర్వీసు పూర్తి చేసుకున్న పలువురికి స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్ మంజూరు, జోన్-8లో 89 నుంచి 98 వార్డుల వరకు అదనపు పారిశుధ్య సిబ్బంది నియామకం, జోన్-3 పరిధి విద్యానగర్ వాణిజ్య సముదాయంలో కాంట్రాక్ట్‌కు ఇచ్చిన పలు దుకాణాలు, డైమండ్ పార్క్ వాణిజ్య సముదాయంలో దుకాణం నంబర్ 3కి నెలసరి అద్దె పెంపు తదితర అంశాలను ఆమోదించినట్లు వెల్లడించారు. స్థాయీ సంఘ సభ్యులతో పాటు ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, డీసీ(రెవెన్యూ) ఫణిరామ్, కార్యదర్శి పి.నల్లనయ్య, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, జేడీ అమృత్ విజయ్ భారతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష


సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: గర్భిణుల్లో రక్త హీనత నివారించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి అన్నారు. గురువారం సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి వైద్య ఆరోగ్య, మహిళ శిశు సంక్షేమం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పాఠశాల విద్య, జగనన్నకు చెబుదాం వంటి అంశాల పురోగతిపై జిల్లాల వారీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు

- ఆధారాల ప్రకారమే ముందుకు..
- రీతి సాహా అనుమానాస్పద మృతి కేసులో విచారణ వేగవంతం
- ఫోరెన్సిక్ ల్యాబ్‌కు సీసీ ఫుటేజీలు
- విద్యార్థిని తల్లిదండ్రుల అనుమానాలపై కూడా విచారణ
- మీడియాతో సీపీ త్రివిక్రమ్ వర్మ


మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి కేసును అన్ని కోణాల్లోను దర్యాప్తు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రీతి సాహా మృతికి సంబంధించిన సీసీ ఫుటేజీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమబెంగాల్‌కు చెందిన రీతి సాహా విశాఖలోని 2022 జూన్‌లో నుంచి సాధన హాస్టల్‌లో ఉంటూ ఆకాష్ బైజూస్ కాలేజ్‌లో నీట్‌కు ప్రిపేర్ అవుతున్నట్టు వెల్లడించారు. గత నెల 14వ తేదీన రాత్రి 10.40 గంటల సమయంలో బిల్డింగ్ మూడో అంతస్తు నుంచి కింద పడినట్లు తెలిపారు. వెంటనే కిచెన్‌లో పనిచేస్తున్న నలుగురు సిబ్బందితో కలిసి హాస్టల్ యజమాని సూర్యకుమారి నగరంలోని వెంకటరమణ ఆస్పత్రికి తీసుకువెళ్లి చేర్పించినట్లు చెప్పారు. అనంతరం రాత్రి 12.30 గంటలకు యజమాని సూర్యకుమారి తన భర్తతో కలిసి నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు ఇచ్చారన్నారు. వెంటనే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ ఆస్పత్రికి వెళ్లి రిపోర్టు తీసుకున్నట్లు వివరించారు. 15వ తేదీ 6 గంటలకు రీతి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యులు ఆమెకు వెంటిలేటర్ అమర్చారన్నారు. సంఘటన జరిగిన రోజే హాస్టల్ మేనేజ్‌మెంట్ విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారన్నారు. 15వ తేదీన వారు పశ్చిమబెంగాల్ నుంచి విశాఖకు వచ్చి వెంకటరమణ ఆస్పత్రి నుంచి కేర్ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అర్ధరాత్రి 1.30 గంటలకు రీతి తల్లిదండ్రులు హత్యాయత్నం కింద బైజూస్ కళాశాలపై ఫిర్యాదు చేశారన్నారు. 16వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు మృతి చెందిందన్నారు.

సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలన

రీతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు హాస్టల్‌లో ఉన్న నాలుగు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. అలాగే హాస్టల్ పక్కన ఉన్న మరో బిల్డింగ్‌లో ఆరు కెమెరాల ఫుటేజీలను సేకరించారు. అందులో రాత్రి 10.30 గంటలకు రీతి బిల్డింగ్‌పై నుంచి కింద పడిపోయిన దృశ్యాలు నమోదైనట్లు వివరించారు. ఆకాష్ బైజూస్‌పై హత్యాయత్నం ఫిర్యాదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. హాస్టల్‌లో పైఅంతస్తుపై పరిస్థితులను పరిశీలించగా గోడపై యాపిల్ ఐప్యాడ్, చెప్పులు ఉన్నాయన్నారు. అయితే రీతి ప్రమాదవశాత్తు పడిపోయిందా? లేదా ఎవరైనా తోసేశారా అన్న విషయాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అందర్నీ విచారిస్తున్నాం..

ఈ కేసు విషయంలో హాస్టల్‌లో రీతి స్నేహితులు, రూమ్‌మేట్స్‌తో పాటు హాస్టల్ వార్డెన్, వాచ్‌మన్, కాలేజీ వారిని కూడా స్వయంగా తానే విచారించినట్లు తెలిపారు. సీసీ ఫుటేజీలు సీజ్ చేసి అన్నింటినీ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. తల్లిదండ్రుల స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డు చేశామన్నారు. వారి అనుమానాలపై కూడా పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుగుతోందన్నారు. వారు ఇప్పటికే హైకోర్టులో కేసు వేశారని, అడ్వకేట్ కమిషనర్ కూడా రాగా అతనికి సీసీ ఫుటేజీలు ఇచ్చినట్లు చెప్పారు. కేసులో ఆధారాల ప్రకారం ముందుకు వెళతామని స్పష్టం చేశారు. హత్యా ప్రయత్నం జరిగినట్లు తెలిసినా, దర్యాప్తులో నిర్లక్ష్యమని నిర్ధారణ అయినా, మరేదైనా జరిగినా దాని ప్రకారం సెక్షన్లు మార్చి కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఫోరెన్సిక్ రిపోర్టు వచ్చిన తరువాత ఒక స్పష్టత వస్తుందన్నారు. ఈ కేసును డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షణలో ఈస్ట్ ఏసీపీ, ద్వారకా ఏసీపీలు స్వయంగా దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వీఆర్‌కు ఫోర్త్‌టౌన్ సీఐ శ్రీనివాస్

- రీతి సాహా మృతి కేసులో ఆరోపణలపై చర్యలు?
- కమిషనరేట్ పరిధిలో మరో ఐదుగురికి స్థానచలనం
- వీఆర్‌లో ఉన్న నలుగురికి పోస్టింగ్‌లు

దొండపర్తి: ఇంటర్ విద్యార్థిని రీతి సాహా మృతి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫోర్త్‌టౌన్ సీఐ వి.శ్రీనివాసరావుపై బదిలీ వేటు పడింది. ఈ కేసును నీరుగార్చేందుకు హాస్టల్ యాజమాన్యం నుంచి డబ్బులు తీసుకున్నారని విద్యార్థిని తల్లిదండ్రుల ఆరోపణల నేపథ్యంలో సీఐని వీఆర్‌కు పంపించడం చర్చనీయాంశమవుతోంది. అతని స్థానంలో వీఆర్‌లో ఉన్న ఎస్.సంజయ్‌కుమార్‌ను నియమించారు.

కమిషనరేట్ పరిధిలో మరో ఐదుగురికి స్థాన చలనం కలిగిస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఫోర్త్‌టౌన్ సీఐను వీఆర్‌కు పంపించగా వీఆర్‌లో ఉన్న మరో నలుగురికి పోస్టింగ్‌లు ఇచ్చారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐగా ఉన్న ఇ.నరసింహారావును హార్బర్ లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న ఎం.శ్రీనివాసరావును పెందర్తి లా అండ్ ఆర్డర్‌కు జి.శ్రీనివాస్‌ను హార్బర్ సబ్ డివిజన్ క్రైమ్‌కు, జి.అప్పారావును సీసీఎస్ సీఐగా నియమించారు.

వాచ్‌మన్‌కు జీవిత ఖైదు

విశాఖ లీగల్ : అపార్టుమెంటు యజమానిని అతి కిరాతకంగా హత్య చేసిన కాపలాదారునికి జీవిత ఖైదు విధిస్తూ నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీహరి గురువారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బర్కత్ అలీ ఖాన్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు బంగారు నాయుడు అక్కయ్యపాలెం నందగిరి నగర్ దగ్గర్లోని ఓ అపార్టుమెంటులో వాచ్‌మన్‌గా పని చేసేవాడు. అదే అపార్టుమెంటులో మొదటి అంతస్తులో కప్పల ప్రకాష్ దాస్ జాతకాలు చెబుతూ ఒక్కడే ఉండేవాడు. ప్రకాష్ రాజ్ కుమారుడు అశోక్ కుమార్ ఉద్యోగ రీత్యా గాజువాకలో నివాముంటున్నాడు. ప్రతిరోజు సాయంత్రం అశోక్ తన తండ్రికి ఫోన్ చేసి మాట్లాడేవాడు. 2013 ఆగస్టు 19వ తేదీ సాయంత్రం అశోక్ తన తండ్రికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. రాత్రి 11 గంటల వరకు ఫోన్ చేసినా ప్రయోజనం లేకపోయింది. అనుమానంతో నందగిరి నగర్‌కు వచ్చిన ఇంటితోపాటు చుట్టుపక్కల గాలించారు. ప్రయోజనం లేకపోయింది. ఇంట్లో బంగారు వస్తువులు కనిపించలేదు. ఇల్లంతా చిందర వందరగా ఉంది. ఆగస్టు 20వ తేదీన అపార్ట్‌మెంట్ సమీపంలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడని స్థానికులు గుర్తించారు. ఈ సమాచారం అందుకున్న నాలుగో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని చూసిన అశోక్ తన తండ్రిదిగా గుర్తుపట్టారు. వెంటనే పోలీసులు జాగిలాలను రంగంలోకి దించారు. ప్రకాష్ దాస్ ఉంటున్న ఇంట్లో రక్తపు మరకలు ఉన్నట్లు కుక్కలు గుర్తించాయి. అవి అక్కడి నుంచి తిన్నగా వాచ్‌మన్ బంగారు నాయుడు ఇంట్లో వరకు వెళ్లాయి. అక్కడ రక్తపు మరకలనూ గుర్తించాయి. పోలీసు పరీక్షల్లో అవి ప్రకాష్ దాస్‌వి అని నిర్ధారణ అయింది. నాటి ఫోర్త్ టౌన్ సీఐ అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో బంగారు నాయుడుకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

నేటి నుంచి ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు


అభ్యర్థుల హాల్ టికెట్లు పరిశీలించే విభాగం

ఆరిలోవ: స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్‌ఐల నియామకాల్లో భాగంగా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షల కోసం విశాఖ రేంజ్ పోలీస్ ఉన్నతాధికారులు గురువారం ఏర్పాట్లు పూర్తి చేశారు. కై లాసగిరి ప్రాంతం ఆర్మడ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానం ఇందుకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి సెప్టెంబర్ 23 వరకు దేహదారుఢ్య పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. విశాఖ రేంజ్ పరిధి అభ్యర్థులకు ఇక్కడే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షణలో జరగనున్నాయి. ఇటీవల నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్షల్లో 17,374 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వారిలో 2,745 మంది మహిళా అభ్యర్థులున్నారు. వారంతా ఇప్పుడు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షకు అర్హత సాధించారు. మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు దేహదారుఢ్య పరీక్ష నిర్వహించనున్నారు. పోలీస్ అధికారులు వారికోసం కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల ఎత్తు, ఛాతి కొలతలతో పాటు లాంగ్ జంప్, హై జంప్, జావిలిన్ త్రో, డిస్కస్ త్రో, పరుగు పోటీలు తదితర పరీక్షలు నిర్వహించనున్నారు. ఒక్కో ఈవెంట్ కోసం వేర్వేరుగా టెంట్లు వేసి విభాగాలు ఏర్పాటు చేశారు. కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద అభ్యర్థులు ఎటు వెళ్లాలో రూటు మ్యాప్‌తో పాటు రిక్రూట్‌మెంట్ బోర్డు అమర్చారు. ఏర్పాట్లను గురువారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులుతో కలిసి పర్యవేక్షించారు.

అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. ఎస్‌ఎల్‌పీఆర్ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో చర్యలు చేపట్టామన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో హాల్ టికెట్, కాల్ లెటర్, అప్లికేషన్, ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం 5 గంటలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


దాసరి గణేష్ (ఫైల్)

సీతమ్మధార: బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. పార్వతీపురం మన్యం జిల్లా, కొమరాడ మండలం, గంగరేగువలసకు చెందిన దాసరి గణేష్(25) రామాటాకీస్ దరి ఇంక్రెడ్ ప్రైవేట్ సంస్థలో ఆరు నెలలుగా సేల్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ఆఫీస్ పని మీద కొరియర్ చేసేందుకు రామాటాకీస్ నుంచి డైమండ్ పార్కు వద్దకు బైక్(ఏపీ39ఎఫ్ఎన్ 7518)పై వెళ్తున్నాడు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పాత తిలక్ షోరూం వద్దకు వచ్చే సరికి గురుద్వారా నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్తున్న 38 రూట్ నంబర్ ఆర్టీసీ బస్సు(ఏపీ 28జెడ్ 5577) ఆ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. బైక్‌తోపాటు గణేష్ రోడ్డు మీద పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108లో కేజీహెచ్‌కు తీసుకెళ్లగా.. అప్పటికే యువకుడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బంధువు ద్వారపురెడ్డి చూడ మనేశ్వరరావు ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి నిందితుడికి పదేళ్లు జైలు

విశాఖ-లీగల్ : లారీలో గంజాయి తరలిస్తున్న వ్యక్తికి పదేళ్లు జైలు శిక్ష విధిస్తూ విశాఖ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి గురువారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ.1,50,000 జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.వేణుగోపాలరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు సింగ్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆమ్ రహో జిల్లాకు చెందినవాడు. వృత్తి రీత్యా లారీ డ్రైవర్. 2020 డిసెంబర్ 21న సాయంత్రం గాజువాక సమీపంలోని అగనంపూడి టోల్ గేటు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు.

గాజువాక వెళుతున్న లారీలో 1,925 కిలోల గంజాయి కనుగొన్నారు. పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్టు చేశారు. లారీలోని గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్‌కు అప్పగించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

లాడ్జిలో యువతి అనుమానాస్పద మృతి

అల్లిపురం: లాడ్జిలో యువతి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం.. డాబాగార్డెన్స్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో గల లాడ్జిలో కేరళ, తిరుచూర్‌కి చెందిన రుమేష్‌కృష్ణ అనే యువతి బుధవారం గది అద్దెకు తీసుకుంది. గురువారం సాయంత్రం వరకు ఆమె గది నుంచి బయటకు రాకపోవడంతో లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందజేశారు.

పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తలుపులు తెరిచి చూడగా ఆమె గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ ఉంది. గదిలో సూసైడ్ నోట్‌ను కూడా పోలీసులు కనుగొన్నారు. సూసైడ్ నోట్‌లో తన చావుకు ఎవరు కారణం కాదని రాసినట్లు ఉందని పోలీసులు తెలిపారు. ఆమె ఎంబీబీఎస్ కోసం చైనా వెళ్లేందుకు ఇక్కడకు వచ్చినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. అక్కడ లభించిన ఫోన్ ఆధారంగా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. లాడ్జి సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ల వేలానికి టెండర్ల ఆహ్వానం

ఆరిలోవ: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో కొన్నాళ్ల క్రితం కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. వాటిలో కొన్ని కంప్యూటర్లు పూర్తిగా, మరికొన్ని విడి భాగాలు పనిచేయడంలేదు. అలాంటి వాటిని వేలం వేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ గురువారం తెలిపారు. నెల 31వ తేదీలోగా టెండరు దాఖలు చేయాలి. అదే రోజున కొనుగోలు కమిటీతో టెండర్లు తెరుస్తామన్నారు. టెండర్ షెడ్యూల్‌లో టెండరు తెరిచే స్థలం తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తిగలవారు రూ.1,000 దరఖాస్తు రుసుం చెల్లించి జిల్లా విద్యాశాధికారి పేరున ఏదైనా జాతీయ బ్యాంక్‌లో డీడీ తీసి టెండరు షెడ్యూల్ పొందాలన్నారు. బుధవారం నుంచి టెండర్ షెడ్యూల్ ప్రారంభమైందన్నారు.

సుబ్రహ్మణ్యంకు ఆరోహన్ సోషల్ ఇన్నోవేషన్ అవార్డు



ఇన్ఫోసెస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి నుంచి అవార్డు అందుకుంటున్న సుబ్రహ్మణ్యం

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): ఆరోహన్ సోషల్ ఇన్నోవేషన్ అవార్డు–2023 సుబ్రహ్మణ్యం ప్రసాద్ కైవసం చేసుకున్నారు. హెల్త్ కేర్ విభాగం నుంచి ఎన్‌లైట్ 360 ఇన్నోవేటర్‌కు సుబ్రహ్మణ్యం ప్రసాద్ అవార్డుకు ఎన్నికయ్యారు. గ్రాంట్ ప్రైజ్ మనీ కింద రూ.50 లక్షల అవార్డును బెంగళూరులోని ఓ ప్రైవేట్ హోటల్లో ఇన్ఫోసెస్ ఫౌండర్ చైర్‌పర్సన్ సుధామూర్తి చేతుల మీదుగా అందుకున్నారు. సుబ్రహ్మణ్యం హెల్త్ కేర్ విభాగంలో తయారు చేసిన ఎన్‌లైట్ 360 ఇన్నోవేటర్‌కు ఈ గుర్తింపు లభించింది. ఇదిలావుండగా అవార్డు గ్రహీత సుబ్రహ్మణ్యం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం నివాసి. భెల్ (హెచ్‌పీవీపీ) విశ్రాంత ఉద్యోగి ముద్దం చిన నాగయ్య, నీలవేణి దంపతుల రెండో కుమారుడు.

హైదరాబాద్‌లో ఐఐటీ పూర్తి చేసిన సుబ్రహ్మణ్యం తర్వాత పరిశోధనలతో ఎన్‌లైట్ 360 ఇన్నోవేటర్‌తో పరిచయమయ్యారు. ఎన్‌లైట్ 360 ఇన్నోవేటర్ ప్రొడక్ట్స్ తయారీకు సుబ్రహ్మణ్యం ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి అనుమతులకు ప్రయత్నిస్తున్నారు. అవార్డు కార్యక్రమంలో ఇండియన్ టాయ్ ఇన్వెంటర్ అండ్ సైన్స్ ఎక్స్‌పర్ట్ పద్మశ్రీ అరవింద్ గుప్తా, ఎన్‌ఐఎంహెచ్ఏఎన్ఎస్ మనోరోగచికిత్స విభాగం డైరెక్టర్ అండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ ప్రతిమా మూర్తి, ఇన్ఫోసెస్ ఫౌండర్ ట్రస్టీ సుమిత్ వర్మనీ, కోశాధికారి సునీల్ కుమార్ దర్యవార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3లో మనోళ్లు

- భరద్వాజ్, ఎర్నికుమార్‌కు జేజేలు
- తమ ఊరి యువకుల ప్రతిభకు మురిసిపోతున్న గవరవరం, నూరెడ్డిపాలెం



భరద్వాజ్, రాళ్లపల్లి ఎర్నికుమార్

చోడవరం రూరల్: చంద్రయాన్-3 విజయం ద్వారా భారత్ ఖ్యాతి ఖండాంతరాలలో వ్యాపించగా.. ఆ విజయంలో అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన మనోళ్లు భాగస్వాములయ్యారు. తమ ఊరి శాస్త్రవేత్తలు భరద్వాజ్, ఎర్నికుమార్ తమ గ్రామాలకే గౌరవం తెచ్చారంటూ గవరవరం, నూరెడ్డిపాలెం గ్రామాలు మురిసిపోయాయి.

గ్రామంలో సత్యం పంతులుగా పేరున్న కొమ్మనమంచి సత్యం మనుమడు భరద్వాజ్ శ్రీహరికోట రాకెట్ ప్రయోగకేంద్రంలో 2021 నుంచి గ్రేడ్ సి శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. చంద్రయాన్-3 ప్రయోగంలో తన వంతు భూమికను పోషించారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు చంద్రయాన్ సాఫ్ట్ ల్యాండింగ్‌తో రాకెట్ ప్రయోగాల చర్చలతో భరద్వాజ్ ఒక్కసారిగా ఊరివారందరికీ గుర్తులోకొచ్చారు. అంతటి గొప్ప విజయంలో తమ గ్రామానికి చెందిన యువశాస్త్రవేత్త భాగస్వామి కావడం తమ ఊరికే గర్వకారణమన్న గ్రామస్తుల మెచ్చుకోలు, అభినందనలతో ఆయన తాతయ్య సత్యం పంతులు సంతోషంలో మునిగితేలారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు భారత్‌కు, భరద్వాజ్‌కు జేజేలు పలికారు. హైస్కూలు విద్యను చోడవరంలోని ప్రైవేటు పాఠశాలలో పూర్తి చేసిన భరద్వాజ్.. కళాశాల విద్యను విశాఖపట్నంలో పూర్తి చేశారు. ఆయన తండ్రి కె.వెంకటరావు విశాఖలోని జిందాల్ కంపెనీలో చేస్తున్నారు.

ఇక గగన్‌యాన్ కోసం శ్రమిస్తాం..

చంద్రయాన్-3 విజయవంతంగా చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ కావడం మమ్మల్ని ఎంతో ఉద్వేగానికి, ఉత్తేజానికి, సంతోషానికి గురి చేసింది. త్వరలో గగన్‌యాన్ ప్రాజెక్టు కూడా ఇలాంటి విజయాన్నే నమోదు చేయాలని ఆకాంక్షిస్తున్నాను. చంద్రయాన్-2 ప్రయోగించే నాటికి నేను ఇంకా విద్యార్థినే. శాస్త్రవేత్తగా చేరిన కొద్ది కాలంలోనే చంద్రయాన్-3 ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వంగా ఉంది. మా బృందం శ్రీహరికోటలో చంద్రయాన్ ప్రయోగ రాకెట్‌ను నిలిపిన దగ్గర నుంచి కౌంట్‌డౌన్ పూర్తయ్యే వరకు ఈ ప్రక్రియలో పాలుపంచుకుంది. అంతరిక్ష ప్రయోగాల పట్ల గల మక్కువతో ఇంటర్మీడియట్ అనంతరం జేఈఈ మెయిన్స్‌లో మంచి మార్కులు సాధించి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ)లో సీటు సాధించాను. అదే నన్ను ఇస్రోలో శాస్త్రవేత్తను చేసింది.

ఎర్నికుమార్‌కు అభినందనలు

నబ్బవరం : చంద్రయాన్-3 విజయంలో మండలంలోని నూరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రాళ్లపల్లి ఎర్నికుమార్ కీలకపాత్ర వహించారు. శ్రీహరికోటలో రాకెట్ లాంచింగ్ విభాగంలో ఇంజినీర్‌గా సేవలు అందించారు. ఈ మిషన్‌లో ప్రస్తుత విభాగంలో 2018 నుంచి పనిచేస్తున్నారు. తండ్రి రాళ్లపల్లి వెంకటరమణ పోర్టులో ఉద్యోగిగా పనిచేస్తూ ఇటీవల రిటైరయ్యారు.

తల్లి బంగారుతల్లి గృహిణి. ప్రస్తుతం ఎర్నికుమార్ భార్య ఝాన్సీతో కలిసి శ్రీహరికోటలో నివాసం ఉంటున్నారు. ఎర్నికుమార్ నబ్బవరంలో మదర్ పబ్లిక్ స్కూల్ 2007-08లో పదో తరగతి చదివారు. ఆ పాఠశాల విద్యార్థులతో పాటు స్వగ్రామం నూరెడ్డిపాలెం గ్రామస్తులు ఎర్నికుమార్‌కు జేజేలు పలికారు.

డబుల్ డెక్కర్ కోచ్‌లో సాంకేతిక లోపం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-తిరుపతి (22707) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ సీ-8 కోచ్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ఈ కోచ్ లేకుండానే గురువారం రాత్రి ఈ రైలు తిరుపతికి బయలుదేరింది. ఈ కోచ్‌లో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు వేరే కోచ్‌ల్లో సర్దుబాటు చేశారు.

వేధింపులతో మహిళ ఆత్మహత్య !

పీఎం పాలెం : మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో ఓ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం రాత్రి 10 గంటలకు వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి పీఎం పాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాయి సుధీర్‌ది వైద్య వృత్తి. గతంలో నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేశారు. భార్య సత్యవాణి(36), కుమారుడు ఆదిత్యతో కలిసి మిథిలాపురి వుడా కాలనీలోని ఎస్ఎఫ్ఎస్ స్కూలు రోడ్డులో గల ఓ విల్లా రెండో ఫ్లోర్‌లో నివసిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల నడుమ పొసగడం లేదు. తరచూ గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఆమె ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో భర్త వేధింపుల కారణంగానే సత్యవాణి ఆత్మహత్యకు పాల్పడినట్లు తేలిందని సీఐ తెలిపారు. వీరి కుమారుడు ఆదిత్య 7వ తరగతి చదువుతున్నాడు. సాయి సుధీర్ సొంతూరు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట.